సాక్షి
చిత్తూరు
ఆదివారం । 6 । అక్టోబర్ । 2024



ఏ'మెను' కొందురు?

పాఠశాలల్లో గత ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహార మెనూను మార్చేందుకు కొత్త ప్రభుత్వం కుట్ర చేస్తోంది. - 8లో



ఏ కష్టమొచ్చినా మేమున్నాం..

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటామని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి తెలిపారు. - 8లో



ఆగని ఏనుగుల దాడులు

పులిచెర్ల మండలంలో చొరబడిన ఏనుగుల గుంపు మామిడి కొమ్మలు విరిచేసి, వరి పంటను తొక్కి నాశనం చేసింది. - 8లో

న్యూస్‌రీల్

కొత్త డీఎఫ్‌ఓగా భరణి



చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌ఓ) చైతన్య కుమార్‌రెడ్డిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. తదుపరి పోస్టింగ్ కోసం ఆయన్ను అటవీశాఖ రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఆదేశించింది. ఇక్కడికి కాకినాడ డీఎఫ్‌ఓగా పనిచేస్తున్న భరణిని బదిలీ చేయగా, ఆమె త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

జెడ్పీలో ముగిసిన బదిలీలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ పరిధిలో ఉద్యోగుల బదిలీల పర్వం ముగిసింది. ఈ మేరకు పరిపాలనా అధికారులు 39, సీనియర్ సహాయకులు 78, జూనియర్ సహాయకులు 148, టైపిస్టులు 55, రికార్డు సహాయకులు 36, డ్రైవర్లు 3, అటెండర్లు 164 మందికి స్థాన చలనం కలిగించారు. మొత్తం 606 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 523 మంది మారారు. కొందరు ఉద్యోగులు బాధ్యతలు చేపట్టగా మరికొందరు చేరాల్సి ఉంది.

జిల్లాకు 85 టన్నుల కందిపప్పు

కాణిపాకం: ప్రజా పంపిణీకి సంబంధించి ఈ నెల జిల్లాకు 85 మెట్రిక్ టన్నుల కందిపప్పును ప్రభుత్వం సరఫరా చేసినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం 85 టన్నులు రాగా మరో రెండు రోజుల్లో 30 టన్ను లు, మళ్లీ జిల్లాకు అవసరమైనంత మేర కందిపప్పు రానుందన్నారు. వచ్చిన పప్పును ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి షాపులకు పంపుతున్నామని పేర్కొన్నారు.

29న ముసాయిదా ఓటర్ల జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 29న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్ నుంచి ఎన్నికల విభాగం అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు, సవరణలకు సెప్టెంబర్ నెలాఖరు వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ నిర్వహిస్తున్నారు. పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టరేట్ అధికారులు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల లొకేషన్‌లు, పేరు మార్పులకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కసరత్తు నిర్వహిస్తున్నారు.

టెట్‌కు 45 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని రెండు, చెన్నైలోని ఒక పరీక్ష కేంద్రంలో మూడవ రోజు నిర్వహించిన టెట్‌కు 45 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడవ రోజు ఒక సెషన్‌లో పకడ్బందీగా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షకు 265 మంది అభ్యర్థులకు గాను 220 మంది హాజరుకాగా 45 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. 83.2 శాతం హాజరు నమోదైనట్లు డీఈఓ వెల్లడించారు.

గల్ల పరీక్షలో అలసత్వం వద్దు


చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఓపీకొచ్చే వారిలో 10శాతం మందికి గల్లపరీక్ష చేయాలని, ఈ విషయంలో అలసత్వం వద్దని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ సూచించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఆయన ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వారం ఓపీకి వచ్చే వారిని విధిగా గల్ల పరీక్ష చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే కచ్చితంగా అలాంటి వారికి గల్ల పరీక్ష చేయాలని సూచించారు. ఈ పరీక్షల్లో క్షయ ఉన్నట్లు బయటపడితే బాధితులకు మెరుగైన వైద్యంతో పాటు పౌష్టికాహారం అందేలా చూస్తామన్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చెప్పారు. సమీక్షలో జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్, అధికారులు శ్రీవాణి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉత్తర్వులను జారీచేసింది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్‌లు పొందాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ ఫీజు అన్ని కేటగిరీలకు రూ.400 చెల్లించాలి. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ లోపు అపరాధరుసుం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ నెల 10వ తేదీ నుంచి 12 వరకు ఆలస్య రుసుం రూ.100 కలిపి రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. రిజిస్ట్రేషన్ కోసం అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, 3 సెట్ల జిరాక్స్‌లు కళాశాలల్లో అందించాల్సి ఉంటుంది.



చిన్నశేష వాహన సేవ



హంస వాహనంపై ఊరేగుతున్న మలయప్ప

విపంచి.. విహరించి!

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గోవింద నామ స్మరణతో తిరుమల గిరులు మార్మోగుతున్నాయి. రెండో రోజు శనివారం రాత్రి స్వామివారు హంస వాహనాన్ని అధిరోహించి వీణాపాణియై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. అంతకుముందు ఉదయం చిన్న శేష వాహనంపై మురళీకృష్ణుడి అలంకారంలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

అంగరంగ వైభవంగా తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- ఉదయం చిన్న శేషుడిపై మలయప్ప విహారం
- రాత్రి హంస వాహనంపై విహరించిన దేవదేవేరులు
- ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన



తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం చిన్న శేషవాహన సేవ ఆద్యంతం రమణీయంగా సాగింది. స్వామివారు మురళీకృష్ణుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకి(నాగలోకానికి రాజు)గా భావిస్తారు. శ్రీవైష్ణవ సంప్రదాయానుసారం భగవంతుడు శేషి, ప్రపంచం శేషభూతం. శేష వాహనం ఈ శేషిభావాన్ని సూచిస్తుంది. చిన్న శేష వాహనాన్ని దర్శిస్తే కుటుంబ శ్రేయస్సుతోపాటు కుండలినీయోగ సిద్ధఫలం లభిస్తుందని ప్రశస్తి.

హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో..

శనివారం రాత్రి శ్రీ మలయప్పస్వామివారు వీణాపాణియై హంస వాహనంపై సరస్వతీమూర్తి అవతారంలో తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మ వాహనమైన హంస పరమ హంసకు ప్రతీక. అది పాలను, నీళ్లను వేరుచేయగలదు. అంటే మంచిని, చెడును గ్రహించగలిగిన అపురూపమైన శక్తిగలదని అర్థం. శ్రీవారు హంస వాహనాన్ని అధిరోహించి దర్శనమివ్వడం ద్వారా భక్తులలో అహంభావాన్ని తొలగించి దాసోహభావాన్ని (శరణాగతి) కలిగిస్తాడని అర్థం. పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, ఈఓ జే.శ్యామలరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

శనివారం ఉదయం చిన్నశేష వాహనసేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ ఈవో శ్యామలరావు ఆవిష్కరించారు.

అలరించిన కళాబృందాల ప్రదర్శన

చిన్నశేష వాహన సేవలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిర్వహించిన కళా బృందాల ప్రదర్శన భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తింది. వాహన సేవల ముందు ఆంధ్ర రాష్ట్రంతో పాటు కర్ణాటక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్ , రాజస్థాన్, ఒడిశా, మహారాష్ట్ర, మణిపూర్, పంజాబ్ రాష్ట్రాల నుంచి 18 కళా బృందాలు, 472 మంది కళాకారులు తమ నృత్యాలతో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.







ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన

పీఎం కిసాన్ నిధులు విడుదల

చిత్తూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ నిధులను శనివారం విడుదల చేసింది. 18వ విడతగా ఈ నిధులను అర్హులైన రైతులకు అందజేస్తోంది. ఈ మేరకు అర్హులైన రైతులందరికీ రూ.2వేల చొప్పున బ్యాంకు ఖాతాకే నిధులు జమవుతున్నాయి. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో జిల్లాలోని 1,79,825 మందికిగాను రూ.35.97 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు వివరించారు.

నేడు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నేడు జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘ సభ్యులు హేమంత్‌రెడ్డి, కిశోర్, పవన్‌కల్యాణ్ శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 8712139311ను సంప్రదించాలని కోరారు.

అన్నదాత దుఃఖీభవ!



ఖరీఫ్ అయిపోయింది.. రబీ వచ్చింది.. సర్కారు మాత్రం వ్యవసాయానికి పైసా కూడా విదల్చలేదు. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు వరాల జల్లు కురిపించారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కోటిగా దాటవేస్తూ వస్తోంది. గత ప్రభుత్వం అమలుచేసిన రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చి సరిపెట్టుకుంది. ఆ తరువాత అదిగో.. ఇదిగో అంటూ వ్యవసాయం ఊసు మాత్రం ఎత్తలేదు. ఖరీఫ్ సీజన్ వెళ్లిపోయి.. రబీ కూడా వచ్చేసింది. అన్నదాత సుఖీభవ పథకం కాస్త అన్నదాత దుఃఖీభవగా మారుతోంది.

- జిల్లాలో రబీ ఆరంభం.. రైతులకు గడ్డుకాలం
- పెట్టుబడి సాయం ఊసెత్తని సర్కారు
- నైరుతిలో రైతుకు నైరాశ్యం
- జాడ లేని వర్షం
- గత సీజనులో 20 వేల హెక్టార్లలో పంటసాగు
- సాయం అందక ఖరీఫ్‌లో వేరుశనగ వైపు వెళ్లని రైతు



చిత్తూరు మండలంలో ఎండిన వేరుశనగ పంట చూపుతున్న రైతు

చిత్తూరు అర్బన్: ఈ ఏడాది ఖరీఫ్ గత నెలాఖరుతో ముగిసిపోయింది. ప్రస్తుతం రబీ ప్రారంభమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా.. రైతులకు చిల్లిగవ్వ విదల్చలేదు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో వ్యాప్తంగా 81,169 హెక్టార్లలో వేరుశనగ, కంది, రాగి, ఉలవలు, సజ్జలు ఇతర పంటలు సాగు చేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం రైతులను దగా చేయడంతో కేవలం 33,920 హెక్టార్లు మాత్రమే సాగుకు నోచుకుంది. ఇపుడు రబీ ప్రారంభంలోనే జిల్లాలో 25 వేల హెక్టార్ల వరకు వరి, మిరప, రాగి, ఉలవలు, వేరుశనగ, చెరకులాంటి ప్రధాన పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నైరుతి రుతుపవనాలు నైరాశ్యాన్ని మిగిల్చి వెళ్లిపోయాయి. ఇక రైతుల ఆశలన్నీ రబీపైనే పెట్టుకున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం ఆ ఆశల్ని అడియాశలు చేస్తోంది.

ఎదురుచూపులు

జిల్లాలోని అర్హులైన దాదాపు 2.30 లక్షల మంది రైతులకు రూ.170 కోట్ల వరకు పెట్టుబడిసాయం అందాల్సి ఉంది. ఒక్కో రైతుకు రూ.6వేల వరకు కేంద్రం నుంచి పీఎం కిసాన్ నిధి నుంచి జమకావాల్సి ఉంది. ఈ ఏడాదికి సంబంధించి జూన్ 18న, అక్టోబర్ 5న రెండు విడతలుగా పీఎం కిసాన్ రూ.2 వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన సాయం ఇప్పటి వరకు అందకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. పంటలు సాగు చేయాలనుకున్న కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రబీ సీజన్‌లోనైనా సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో రబీ పంటసాగు వివరాలు
సాధారణ విస్తీర్ణం 27,774 హెక్టార్లు
2022-23లో సాగైన పంట విస్తీర్ణం 20,591 హెక్టార్లు
2023-24లో సాగైన పంట విస్తీర్ణం 19,345 హెక్టార్లు

వేరశనగ వదులుకున్నారు

దున్నకం నుంచి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు కొనుగోలు కోసం ప్రభుత్వం సీజన్ ప్రారంభంలోనే సాయమందించాలి. అయితే కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపడంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారు. ఆయా పంటల్లో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే అదునుకు తగ్గట్టు వర్షాలు కురవకపోడంతో వేరుశనగ పంట ఎత్తిపోయింది. కనీసం వేరుశనగ తీగలు కూడా మిగలలేదు. 80శాతం వరకు పంట ఎండిపోవడంతో పెట్టుబడులు నేలపాలయ్యాయి. మిగిలిన పంట అంతంత మాత్రంగానే ఉండటంతో ఖరీఫ్ దిగుబడులపై రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

నాడు రైతులకు అండగా జగన్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే రైతన్నలకు రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తూ వచ్చింది. కరోనా లాంటి సంక్షోభంలో కూడా ఏటా క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరి నెలల్లో ప్రతి రైతుకు పీఎం కిసాన్‌తో కలిపి రూ.13,500 ప్రకారం ఖాతాల్లో జమ చేశారు. కౌలు రైతులు, దేవదాయ, అటవీభూమి సాగుదారులకు కేంద్రంతో సంబంధం లేకుండా పూర్తి స్థాయి పెట్టుబడి సాయం అందించారు. గత ప్రభుత్వం హయాంలో పెట్టుబడి సాయంగా ఏటా సగటున జిల్లాలో 2.24లక్షల మంది రైతులకు రూ.886.31 కోట్లు అందించారు. దీనికితోడు వరుణుడు అనుకూలించడంతో రైతు పంట పండింది.

అన్నదాతకు కన్నీళ్లు..

తాము అధికారంలోకి వస్తే ప్రతి సీజన్‌లో రైతులు పంటలను వేసుకోవడానికి పెట్టుబడి సాయం ఇస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. అన్నదాతకు సాయం చేయడంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు ఎటూ తేల్చడం లేదు. ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని గొప్పగా చెబుతూ 'సూపర్ సిక్స్'తో ఎన్నికల ముందు అదరగొట్టిన చంద్రబాబు.. తీరా అధికారం చేపట్టగానే దాని ఊసే ఎత్తడం లేదు. 'అన్నదాత సుఖీభవ' అంటూ పథకం పేరుమార్చి రైతులను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20 వేలు ఎప్పటి నుంచి ఇస్తారు.? ఎన్ని విడతలుగా అందిస్తారు? పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా ఇస్తారా? రూ.6 వేలు పోనూ మిగతా రూ.14 వేలు అందిస్తారా? అనేది కూడా స్పష్టం చేయకుండా అన్నదాతలను మోసం చేస్తున్నారు. సర్కారు నిర్లక్ష్య వైఖరిని రైతులు, రైతు సంఘాల నాయకులు, విపక్షాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

ఏమీ మిగల్లేదు



ఈ సారి వానలు లేక చెనిగిచెట్లు ఎండిపోయి ఏమీ మిగల్లేదు. పోనీ ఏదైనా పంట చేద్దామంటే పెట్టుబడికి డబ్బు లేదు. నాలుగు నెలలుగా ఈ గవర్నమెంటు రూపాయి ఇవ్వలేదు. ఇంకేమి పంట చేసేది. అందుకే ఈసారి సాలిచ్చేద్దామనుకుంటా ఉండాను. మా బాధ ఎవరికీ అర్థం కాలేదు.

- రామకృష్ణప్ప, బైరెడ్డిపల్లె

ప్రభుత్వ భరోసా ఏది సామీ?



వ్యవసాయానికి ప్రభుత్వం నుంచి భరోసా అవసరం లేదా? గత ప్రభుత్వంలో ప్రతి ఏటా పంట నష్ట పరిహారంగా ప్రతి రైతు ఖాతాకు డబ్బు జమచేసి భరోసా ఇచ్చారు. కానీ ఇప్పుడు ఆ భరోసా లేదు. రైతులపై చిన్నచూపు తగదు. మా బాధలు అర్థం చేసుకుని ప్రభుత్వం సాయం చేయాలి.

- చలపతి రెడ్డి, గంగవరం

చెనిక్కాయలు పోయినాయి



నేను రెండు ఎకరాల్లో చెనిక్కాయలు ఏశాను. వానలే పడలేదు. పంట మొత్తం పోయింది. పరిహారంగా రూపాయి అందలేదు. ఇపుడు అప్పులోళ్లకు వడ్డీలు కడతా ఉండాను. రబీ వచ్చేసింది పంట వేద్దామంటే మళ్లీ అప్పు చేయాలి. ఏం చేసేది తెలియక గమ్మున ఉండాను.

- గౌరప్ప, పెద్దపంజాణి

9న పుంగనూరుకు జగన్ రాక



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి

పుంగనూరు: హత్యకు గురైన బాలిక అశ్వియఅంజుమ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న పుంగనూరుకు రానున్నట్లు మాజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్పతో కలసి శనివారం ఆయన పట్టణ సమీపంలోని రాంపల్లె బైపాస్ వద్ద హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. మైదానం శుభ్రం చేసి, హెలిక్యాప్టర్ దిగేందుకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పెద్దిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి హెలిక్యాప్టర్‌లో ఉదయం పుంగనూరుకు వస్తారని తెలిపారు. హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. తిరిగి పుంగనూరు నుంచి తిరుపతికి హెలిక్యాప్టర్‌లో, రేణిగుంట నుంచి విమానంలో విజయవాడకు వెళతారని పెద్దిరెడ్డి తెలిపారు. జగన్ పర్యటనను జయప్రదం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అభిమానులు తరలిరావాలని, అయితే ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీలు సోమశేఖర్ రెడ్డి, దామోదర్‌రాజు, మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, సీమ జిల్లాల మైనారిటీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్ షరీఫ్‌తోపాటు మైనారిటీ నాయకులు సలీంబాషా, మహబూబ్‌బాషా, ఖాదర్‌బాషా, కౌన్సిలర్లు పూల త్యాగరాజు, అమ్ము, రేష్మ, జేపీ యాదవ్‌తోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి ట్యాంకర్ బోల్తా



కుప్పంరూరల్: కుప్పం మండలం, బేటరాయ స్వామి కొండ వద్ద శనివారం నిర్వహించిన శ్రీనివాస కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు శుద్ధజలం అందించేందుకు నీటిని తీసుకెళ్లిన ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తా పడింది. దీంతో డ్రైవర్ భాస్కర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కొండపై ఉన్న వైద్య బృందం ఆయన్ను కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించింది.

ఆగని ఏనుగుల దాడులు

కల్లూరు(పులిచెర్ల): పులిచెర్ల మండలంలోని పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. మండలంలోని గొరిశెట్టివారిపల్లె, బోడిరెడ్డిగారిపల్లె, చిట్టారెడ్డి పేటల్లో శనివారం తెల్లవారు జామున ఏనుగులు పంట పొలాలపై పడ్డాయి. ముఖ్యంగా వరి, మామిడి పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులకు పంట నష్టం అంచనాల నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఎఫ్‌బీఓ శ్రీదేవి తెలిపారు.

ఏ మెను కొందురు!

2019కి ముందు : జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కారు పాఠశాలల్లో 2019 సంవత్సరం ముందు టీడీపీ పాలనలో ప్రతి రోజూ ఒకే మెనూ అమలయ్యేది. ఎన్ని సంవత్సరాలు గడిచినా ఆ మెనూలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎలాంటి మార్పు చేయలేదు. ప్రతి రోజూ ఒకే మెనూను అమలు చేయడంతో సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని సగానికి సగం మంది విద్యార్థులు తినేందుకు ఆసక్తి చూపేవారు కాదు.

2019 తర్వాత : జిల్లా వ్యాప్తంగా సర్కారు పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకంలో వినూత్న మార్పులు తీసుకొచ్చింది వైఎస్సార్‌సీపీ సర్కారు. గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్నభోజన పథకం పకడ్బందీగా అమలు చేసేందుకు రూ.వేల కోట్లు ఖర్చు చేశారు. సర్కారు పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు రోజుకో మెనూ ప్రకారం భోజనం తినాలనే మంచి ఉద్దేశంతో గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆ పథకంలో రోజుకో మెనూ అమలుకు శ్రీకారం చుట్టారు. సర్కారు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టడం గత ప్రభుత్వంలో మొదలు పెట్టారు.

- మధ్యాహ్న భోజన మెనూలో మార్పులు !
- రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు
- అమలు కంటే మార్పులపై కూటమి సర్కారు ప్రత్యేక దృష్టి
- మొదట పథకం పేరు మార్పు.. ప్రస్తుతం మెనూ మార్పునకు కుట్ర
- ప్రతి రోజూ ప్రత్యేక మెనూ అమలు చేసింది వైఎస్సార్ సీపీ సర్కారే

రుచికరంగా మారింది వైఎస్సార్‌సీపీ పాలనలోనే..

సర్కారు పాఠశాలల్లో అమలు చేసే మధ్యాహ్న భోజన పథకంలో రోజుకో మెనూను ప్రవేశపెట్టింది, రుచికరమైన భోజనం అందించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. ప్రోటీన్ ఆహారాన్ని విద్యార్థులకు అందించింది. సర్కారు పాఠశాలల్లో రుచికరమైన, నాణ్యమైన ఆహారం పెట్టేందుకు పలు పాఠశాలల్లో సెంట్రలైజ్డ్ కిచెన్‌లను సైతం నిర్మించింది. సోమవారం నుంచి శనివారం వరకు రోజుకు ఒక మెనూను అమలు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,444 పాఠశాలల్లో అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకం గత ప్రభుత్వం రూ.కోట్ల నిధులను ఖర్చు చేసింది.

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1908, ప్రాథమికోన్నత పాఠశాలలు 206, ఉన్నత పాఠశాలలు 330 మొత్తం 2,444 పాఠశాలలున్నాయి. ఆ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,44,500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలన్నింటిలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గోరుముద్ద పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకంలో ప్రతి రోజు ప్రత్యేక మెనూ ను అమలు చేసింది. ఆ ప్రత్యేక మెనూను జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పకడ్బందీగా అమలయ్యేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించేవారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంటనే గోరుముద్ద పథకం పేరును డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా పేరు మార్చింది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపింది.

మెనూలో మార్పులకు కసరత్తు

మధ్యాహ్నభోజన పథకం మెనూలో మార్పులు చేయాలని ఎవరూ అడగనేలేదు. అయితే అత్యుత్సాహంతో కూటమి ప్రభుత్వం తల్లిదండ్రులు, విద్యార్థుల కోరిక మేరకు మెనూలో మార్పులు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రచారం చేస్తోంది. ఇటీవల కలెక్టర్లకు మెనూలో మార్పులకు సంబంధించిన నివేదికలు సిద్ధం చేసి, పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆ ఆదేశాల మేరకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ బృందాల్లో సీనియర్ హెచ్‌ఎంలు, ఎంఈఓలు, మధ్యాహ్న భోజన కార్మికులను సభ్యులుగా చేర్చి, మెనూలో చేయాల్సిన మార్పుల అంశంపై చర్చించారు. అనంతరం మెనూలో చేయాల్సిన మార్పులను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

అమలుకంటే.. మార్పులపైనే దృష్టి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక మార్పులు చేసి గొప్పలు చెప్పుకునేందుకు ప్రయత్నిస్తోంది. సర్కారు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ బాగానే ఉన్నప్పటికీ మార్పులకు కుట్ర చేస్తున్నారు.

ప్రైవేట్‌పరం చేసేందుకేనా..?

2019వ సంవత్సరానికి ముందు టీడీపీ ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌పరం చేసింది. జిల్లాలో పలు పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అప్పట్లో ఇస్కాన్, ఈషా ఫౌండేషన్, నవ ప్రయాస పలు ప్రైవేట్ సంస్థలకు అప్పగించింది. ఇప్పుడు ఈ పథకాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు యత్నిస్తోందని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన మెనూను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	1 నుంచి 10 వరకు చదివే విద్యార్థులు
1,908	206	330	1,44,500

టీడీపీ పాలనలో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల శాతం	వైఎస్సార్ సీపీ పాలనలో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల శాతం	లబ్ధిపొందుతున్న స్వయం సహాయక సంఘాలు
40	95	4,798



చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజనం (ఫైల్)

మెనూలో మార్పులు చేసేందుకే..



ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు చేసేందుకు నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు. ఆ మేరకు నివేదికలను సిద్ధం చేసి పంపాలని డీఈఓలను ఆదేశించాం.

– శామ్యూల్, ఆర్జేడీ, వైఎస్సార్ కడప జిల్లా

నివేదికలు సిద్ధం చేశాం



మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులకు నివేదికలు పంపమని ఆదేశించారు. ఆ మేరకు ప్రత్యేక కమిటీ సభ్యులతో వివరాలు సేకరించాం. వాటిని ప్రత్యేక నివేదికల రూపంలో సిద్ధం చేసి రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపించాం.

– దేవరాజు, డీఈఓ, చిత్తూరు జిల్లా

ఏకష్టమొచ్చినా మేమున్నాం.. అధైర్యపడకండి!

చౌడేపల్లె: వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఏకష్టమొచ్చినా మేమున్నాం..అధైర్య పడకండి అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మండలంలోని అన్నిపల్లెలో ఉంటున్న కాగతి ఎంపీటీసీ అపర్ణ నారాయణ రెడ్డి ఇంటికి శనివారం వారు వచ్చారు. నారాయణరెడ్డి తల్లి వెంకటమ్మ 15 రోజుల క్రితం మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే, ఎంపీలు నివాళులర్పించారు. అనంతరం ఎంపీటీసీ దంపతులను ఓదార్చారు. కాగతి సర్పంచ్ షంషీర్‌బాషా కుమారుడు తన్వీర్ మూడు రోజుల క్రితం మృతి చెందాడు. సర్పంచ్ స్వగ్రామమైన పెద్దూరుకు చేరుకున్న ఎమ్మెల్యే, ఎంపీ షంషీర్ బాషా కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తాము అండగా ఉంటామని, భయపడాల్సిన అవసరం లేదంటూ భరోసానిచ్చారు. ఎమ్మెల్యే, ఎంపీ రాకతో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు, నాయకులు వారిని కలిసేందుకు పోటీ పడ్డారు. వారితో మమేకమై సమస్యలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంజిబాబు, నాయకులు నాగభూషణ రెడ్డి, పద్మనాభరెడ్డి, రమేష్‌నాయుడు, చిన్నప్ప, మునికృష్ణమ నాయుడు, జమీల్‌సాబ్, రవికుమార్‌రెడ్డి, గిరి రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.



అన్నిపల్లెలో ఎంపీటీసీ కుటుంబ సభ్యులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి

సుప్రీం తీర్పు బాబుకు చెంపపెట్టు

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : తిరుమల లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేసిన సీఎం చంద్రబాబుకు సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారంటూ చంద్రబాబు అసత్య ప్రచారం చేశారని దుయ్యబట్టారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయాలని చూడడం దారుణమన్నారు. అయితే ప్రజలు వాస్తవాలు గ్రహించడం వల్ల కూటమి కుయుక్తులు సఫలం కాలేదన్నారు. వంద రోజుల టీడీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మద్యానికి ప్రాధాన్యత ఇచ్చి, ఇంగ్లీష్ మీడియం ఎత్తివేస్తున్నారని విమర్శించారు. టీడీపీ అసమర్థపాలన నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు జత్వానీ కేసును తెరపైకి తెచ్చారని, ఆ తర్వాత కల్తీ నెయ్యి అంటూ దేవదేవునికే మహాపచారం చేశారని ధ్వజమెత్తారు. గతంలో చంద్రబాబు పాలనలో నెయ్యి ట్యాంకర్లను 14 సార్లు వెనక్కి పంపితే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 18 సార్లు వెనక్కి పంపారని గుర్తు చేశారు. లడ్డూలో కల్తీ ఉందని చంద్రబాబు చెప్పినా తిరుమల లడ్డూల విక్రయం తగ్గలేదన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టి, అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని మండిపడ్డారు. దీనిపై ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనన్న భయంతో ఇలా కల్తీ రాజకీయం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, నాయకులు షణ్ముగరెడ్డి, సుబ్రమణ్యం, రవిరెడ్డి, మునస్వామి నాయుడు, దనంజయరెడ్డి, సురేష్, గోపాల్, కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ



సర్పంచ్ పిఎస్ లక్ష్మికి అభినందనలు తెలుపుతున్న అభిమానులు

వి.కోట: స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ పి.ఎస్.లక్ష్మి చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ కలెక్టర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల పంచాయతీలో చోటు చేసుకున్న ఇరు వర్గాల ఘర్షణ నేపథ్యంలో సర్పంచ్ కుటుంబం ఓ వర్గానికి మద్దతు తెలిపారన్న ఫిర్యాదుతో కలెక్టర్ సుమిత్ కుమార్ తాత్కాలికంగా సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు. ఆ బాధ్యతలను ఉప సర్పంచ్‌కు అప్పగించారు. అనంతరం ఘర్షణలో సర్పంచ్ ప్రమేయం లేదని అధికారులు చేసిన విచారణలో తేలింది. దీంతో ఆమెకు చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో సర్పంచ్‌కు పలువురు అభిమానులు అభినందనలు తెలిపారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 సెషన్ల కోసం 9, 11 తరగతుల్లో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వీ.శేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఉందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అయితే 9వ తరగతిలో చేరడానికి 2024-25న 8వ తరగతి చదివి ఉండాలని, 01-05-2010 నుంచి 31-07-2012 మధ్యా కాలంలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా 11 తరగతిలో చేరడానికి 2024-25లో పదో తరగతి చదివి ఉండాలని, 01-06-2008 నుంచి 31-07-2010 మధ్యలో జన్మించిన వారు మాత్రమే అర్హులని ఆయన పేర్కొన్నారు.

మొగిలి ఘాట్‌లో మూడు వాహనాల ఢీ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ సమీపంలో శనివారం సాయంత్రం మూడు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ప్రయాణికులు ఎవరూ గాయపడలేదు. మొగిలి ఘాట్ సమీపంలోని దొరచెరువు వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై పలమనేరు నుంచి చిత్తూరుకు బయల్దేరిన కర్ణాటక ఆర్టీసీ బస్సు, కారు, పాల ట్యాంకర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకరు వద్ద ఒకదాని వెనుక ఒకటి ఢీ కొన్నాయి. వాహనాల ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్లు, ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. రహదారిపై ప్రమాదం చోటు చేసుకోవడంతో పలమనేరు-చిత్తూరు వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న బంగారుపాళెం హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వాహనాలను రహదారి పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రహదారిపై వేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద వేగంగా వెళ్లే వాహనాలు ఒక్కసారిగా స్లో చేయడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందంటూ పలువురు వాహనదారులు తెలిపారు. మొగిలి ఘాట్‌లో ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల వేగం తగ్గించి వెళ్లే దిశగా పోలీసులు, రవాణా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నారు. అయినా ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో పోలీసులకు సవాల్‌గా మారింది.



మొగిలి ఘాట్‌లో ఢీకొన్న వాహనాలు

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

- చిత్తూరు, ప్రకాశం జట్లకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం



తలపడుతున్న చిత్తూరు, కర్నూలు జట్లు

కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్ఆర్‌ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 87 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు రెండోరోజు శనివారం 76 ఓవర్లలో 202 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 56.3 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 85 పరుగులకే ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో చిత్తూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

ప్రకాశం జట్టుకు ఆధిక్యం

కేఎస్ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 62 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు 41.3 ఓవర్లలో 106 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జట్టు 58 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కడప జట్టుకు ఆధిక్యం

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 58 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 64.1 ఓవర్లలో 173 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 48.3 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌డ్రాగా ముగిసింది. కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులు చేసి ఉండటంతో ఆధిక్యం లభించింది.